# నాచులో అధిక ప్రొటీన్లు

**ఐఐసీటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): మానవ శరీరాభివృద్ధికి ఎంతో అవసరమైన అమైనో యాసిడ్లు నాచు (ఆల్గే)లో ఎక్కువగా ఉంటాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) పరిశోధకులు కనుగొన్నారు. ఆల్గేలో కిరణ జన్య సంయోగ క్రియ జరిగినప్పుడు క్లోరెలా గ్రోత్ ప్రొటీన్ (సీజీఎఫ్) ఫ్యాక్టర్ అనే పదార్థం ఉత్పత్తి అవుతుందని, ఇది అమైనో యాసిడ్లతోపాటు పెప్టైడ్లు, న్యూక్లియోటైడ్లు, పాలీ శాకరైడ్లు, గ్లైకోప్రో లాంటి సూక్ష్మ పోషకాలతో నిండి ఉంటుందని తేల్చారు. సాధారణ ప్రొటీన్ల కంటే సీజీఎఫ్‌లో అధిక పోషకాలు ఉంటాయని ఐఐసీటీ అధ్యయన బృందం గుర్తించింది.

# కృష్ణా, తుంగభద్రకు వరద

గద్వాల/అయిజ, జూన్ 12 : కృష్ణా, తుంగభద్ర నదులకు స్వల్పంగా వరద కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలతో బుధవారం జూరాల ప్రాజెక్టుకు 7,735 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 316.240 మీటర్లకు చేరింది. ప్రస్తుతం 9.657 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు 2,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్‌ఫ్లో 2,357 క్యూసెక్కులుగా నమోదైందని ఏఈ రాందాస్ తెలిపారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.4 అడుగుల నీటిమట్టం ఉన్నట్టు పేర్కొన్నారు. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 3,850 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటినిల్వ 100.855 టీఎంసీలకుగాను ప్రస్తుతం 5.289 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# దేవరకద్ర అంగన్‌వాడీలోనూ కుళ్లిన గుడ్లే



దేవరకద్ర అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిపోయిన గుడ్లు

దేవరకద్ర, జూన్ 12 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర అంగన్‌వాడీ కేంద్రంలోనూ కుళ్లిన కోడిగుడ్లు వెలుగుచూశాయి. గత సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట, జనగామ జిల్లా నర్మెట మండలం మల్కాపేటలో కుళ్లిన కోడిగుడ్ల కారణంగా ఇద్దరు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం దేవరకద్ర పట్టణంలోని దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయినట్టు గుర్తించారు. దీనిపై బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




















